
సాక్షి గుంటూరు

శనివారం । 18 । అక్టోబర్ । 2025



సాగర్ నీటిమట్టం వివరాలు

విజయపురి సౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 589 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి జలాశయానికి 36,531 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.



పులిచింతల ప్రాజెక్టు సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 30,411 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నుంచి దిగువకు 37,760 క్యూసెక్కులు వదులుతున్నారు.

రేపు అభయాంజనేయస్వామి వార్షికోత్సవం



ఫిరంగిపురం: వేమవరం అడ్డరోడ్డు సమీపంలోని అభయాంజనేయస్వామి ఆలయ 8వ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించనున్నారు. భక్తులకు గ్రామస్తుల సహకారంతో అన్నప్రసాద వితరణ చేయనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.

న్యూస్‌రీల్

అర్జీలు స్వీకరించిన జిల్లా ఎస్పీ



నగరంపాలెం: స్థానిక నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ)ంలో పోలీస్ సిబ్బంది వినతులు, సమస్యల పరిష్కారానికి శుక్రవారం పోలీస్ స్టాఫ్ గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అర్జీలు స్వీకరించారు. సంబంధిత పోలీస్ సిబ్బందితో మాట్లాడి, సమస్యలను ఆలకించారు. అనంతరం వాటిని పరిష్కరించాలంటూ అధికారులను ఆదేశించారు. 15 మంది పోలీస్ సిబ్బంది బదిలీలు, సర్వీస్ సంబంధిత సమస్యల పరిష్కారానికి వినతి పత్రాలు అందించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమం, వారి వినతులను పరిష్కరించేందుకు అత్యంత ప్రాధాన్యత కల్పిస్తామని జిల్లా ఎస్పీ చెప్పారు.

త్రికోటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.59 లక్షలు



నరసరావుపేట రూరల్: కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానానికి హుండీల ద్వారా రూ. 59,97,254 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో డి.చంద్రశేఖర్ తెలిపారు. ఆలయంలో శుక్రవారం హుండీల లెక్కింపు నిర్వహించారు. ఆలయంలో హుండీల ద్వారా రూ.55,76,935, అన్నదానం హుండీల ద్వారా రూ.4,20,319 లభించినట్లు వివరించారు. నగదుతోపాటు బంగారం 51.500 గ్రాములు, వెండి 330 గ్రాములు, విదేశీ కరెన్సీ 96 అమెరికన్ డాలర్లు, 140 కెనడా డాలర్లు, 100 యూఏఈ డాలర్లు లభించినట్లు తెలిపారు. హుండీ లెక్కింపును ఆలయ ఈవో డి చంద్రశేఖరరావు, దేవాదాయ శాఖ ఆభరణాల తనిఖీ అధికారి పి.సైదమ్మ భాయ్‌లు పర్యవేక్షించారు.

ఎస్సీ, ఎస్టీ కేసు విచారణ



యడ్లపాడు: ఎస్సీ, ఎస్టీ కేసును నరసరావుపేట డీఎస్పీ పి హనుమంతరావు శుక్రవారం విచారించారు. ఇటీవల యడ్లపాడు గ్రామంలోని విజయదుర్గ వైన్స్‌లో పనిచేస్తున్న యువకుడిపై దాడి జరిగిన ఘటనలో బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సీ, ఎస్టీ(పీవోఏ) కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. రెండో దశ దర్యాప్తులో భాగంగా డీఎస్పీ యడ్లపాడు ఎస్ఐ టి శివరామకృష్ణతో కలసి వైన్స్ వద్దకు వెళ్లి స్వయంగా వివాదానికి సంబంధించిన అంశాలను రికార్డు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో చిలకలూరిపేట రూరల్ సీఐ బి సుబ్బానాయుడు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు బాలిక



చీరాల: చిన్న చిన్న కారణాలతో తల్లిదండ్రులతో విభేదించి బయటకు రావడం సరైన పద్ధతి కాదని వన్‌టౌన్ సీఐ ఎస్.సుబ్బారావు తెలిపారు. చీరాల పట్టణంలో శుక్రవారం కొట్ల బజారులో ఒంటరిగా తిరుగుతున్న 17 సంవత్సరాల బాలికను శక్తి టీం సభ్యులు గుర్తించారు. చీరాల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు. మహిళా ఎస్ఐ రాజ్యలక్ష్మి సమక్షంలో బాలిక తల్లిదండ్రులను పిలిపించి, కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.

బీచ్‌ల్లో ఈత నిషేధం



బాపట్ల: బీచ్‌ల్లో ఈత నిషేధించినట్లు బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ ప్రకటించారు. మద్యం తాగి సముద్రంలోకి దిగడానికి వీల్లేదని, ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని సమావేశ హాలులో శుక్రవారం బాపట్ల జిల్లా సముద్ర తీర ప్రాంతాల్లోని పోలీసు అధికారులతో ప్రత్యేకంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో పర్యాటకుల రద్దీ పెరిగే అవకాశం ఉందన్నారు.

కలం కదిలింది.. కూటమి వెన్నులో వణుకు పుట్టింది.. కుట్రలకు తెరలేచింది.. సాక్ష్యాల 'సాక్షి'గా ప్రజాగొంతుకై నిలిచిన కారణంగా నోటీసులు, కేసుల పేరిట వేధింపులు ప్రారంభం అయ్యాయి. కలం మళ్లీ కదిలింది.. ఈసారి కూటమి పాలకుల గుండెల్లో అక్షరమై దిగింది. మళ్లీ అదే తీరు.. నోటీసుల రూపంలో వేధింపులు కొనసాగాయి. అక్రమాలను, అసత్యాలను, అవినీతిని ఎండగట్టి ప్రజల పక్షాన పోరాటం చేసినందుకు మళ్లీ మళ్లీ వేధింపులు తప్పలేదు. ఏ తప్పూ చేయకున్నా .. ప్రజల తరపున మాట్లాడితేనే ఇలా వేధిస్తారా అంటూ ఈ సారి కలాలన్నీ కలసి కదన రంగంలోకి దూకాయి. కూటమి కుట్రలపై క్షేత్రస్థాయిలో నిరసన గళాలై ఎగసిపడ్డాయి. సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, పాత్రికేయులకు నోటీసులు ఇవ్వడం, అక్రమ కేసులు పెట్టడంపై శుక్రవారం జిల్లా వ్యాప్తంగా జరిగిన నిరసన కార్యక్రమాల్లో పాత్రికేయులు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వ తీరును ఎండగట్టారు. పత్రికా స్వేచ్ఛను కాపాడాలని నినదించారు.

కలమే గళమై.. నిరసన స్వరమై..

సాక్షి కార్యాలయాలపై దాడులను, అక్రమ కేసులను నిరసిస్తూ ప్రదర్శన



గుంటూరులోని ఎస్పీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న జర్నలిస్టులు, ప్రజాసంఘాల నేతలు, న్యాయవాదులు

- కదం తొక్కిన జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు, ప్రజా సంఘాల నేతలు
- 'సాక్షి' ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించడంపై మండిపాటు
- పత్రిక స్వేచ్ఛను హరించే చర్యలు తగవని కూటమి ప్రభుత్వానికి హితవు

నగరంపాలెం (గుంటూరు వెస్ట్): పత్రిక స్వేచ్ఛపై ముప్పేట దాడిని ప్రజా సంఘాలు, జర్నలిస్టుల సంఘాలు, న్యాయవాదులు ఖండించారు. సాక్షి ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డి, హైదరాబాద్‌లోని సాక్షి ప్రధాన కార్యాలయంలోకి ఏపీ పోలీసులు చొరబడి పత్రిక స్వేచ్ఛను హరించడంపై ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసులు, ఇచ్చిన నోటీసులను నిరసిస్తూ శుక్రవారం ప్లకార్డులతో సంఘాల నేతలు ప్రదర్శన చేపట్టారు. గుంటూరు కలెక్టర్ కార్యాలయం వద్ద ప్రారంభమైన ఈ ప్రదర్శన గుంటూరు జిల్లా ఎస్పీ కార్యాలయం వరకు కొనసాగింది. ప్రజాస్వామ్యానికి సంకెళ్లు, సాక్షి ఎడిటర్‌పై దాడి- పత్రికాస్వేచ్ఛపై దాడి, నియంత ప్రభుత్వం సిగ్గు సిగ్గు, జర్నలిస్టుల గొంతునొక్కి దౌర్జన్య పాలనా?, ప్రజాస్వామ్యమా - పోలీసు రాజ్యమా? అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. పత్రిక స్వేచ్ఛపై ముప్పేట దాడి అంటూ ఫ్లెక్సీతో ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. అనంతరం నగరంపాలెంలోని జిల్లా ఎస్పీ కార్యాలయంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌కు వినతిపత్రం అందించారు. సాక్షి గుంటూరు మేనేజర్ టి.గోపీ, జిల్లా ఎడిషన్ ఇన్‌చార్జి మాకిరెడ్డి తిరుమలరెడ్డి, బ్యూరో డి.రమేష్, యాడ్స్ ఏజీఎం జి.వెంకటరెడ్డి, సాక్షి టీవీ బ్యూరో ఇన్‌చార్జి అశోక్, సబ్ ఎడిటర్లు దివి రఘు, ఎస్ఎస్ శర్మ, శ్రీనివాస్, వెంకట్, సర్క్యులేషన్ డీసీఎం షేక్ అబ్దుల్లా, జర్నలిస్టులు, ప్రజా సంఘాల నేతలు, జర్నలిస్టు సంఘాల నాయకులు, న్యాయవాదులు పాల్గొన్నారు.



ఏ వార్త రాసినా తప్పే అనేలా కూటమి సర్కారు తీరు



వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ కార్యదర్శి పాలూరి వెంకటరెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య దేశంలో మీడియా నాలుగో స్తంభం అని పేర్కొన్నారు. వార్తలు రాసేందుకు సోర్సు ఎలా వచ్చిందని పత్రికలను అడగడం స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఏ ప్రభుత్వం కూడా చేయలేదని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ప్రత్యేకంగా 'సాక్షి'ని లక్ష్యంగా చేసుకుందని అన్నారు. ఏ వార్త రాసినా తప్పే అన్నట్టుగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని మండిపడ్డారు. సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి హైదరాబాద్‌లో ఉంటే ఇంటికి వెళ్లి కుట్రపూరితంగా నోటీసులు జారీ చేశారని ధ్వజమెత్తారు. ఆయన్ను మానసికంగా వేధించాలనే కుట్రకు తెరలేపారని అన్నారు. ఏపీ అంతటా సాక్షి మీడియాపై, కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న వారిపై కూడా ఇలాంటి దాడులు చేస్తున్నారని ఆరోపించారు. రానున్న రోజుల్లో ప్రజా సంఘాలు ఈ విషయంలో పాత్రికేయులకు మద్దతుగా ఉంటాయని ప్రకటించారు.

జర్నలిస్టులను వేధించే హక్కు లేదు



వీసీకే రాష్ట్ర మహిళా ప్రతినిధి జయసుధ మాట్లాడుతూ పత్రికలకు భావవ్యక్తీకరణ స్వేచ్ఛను డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో రాశారని అన్నారు. ఏ పౌరుడికైనా స్వేచ్ఛగా మాట్లాడే హక్కు, భావాలను వ్యక్తీకరించే హక్కు ఉందన్నారు. జర్నలిస్టులకు కూడా ఇవి వర్తిస్తాయని పేర్కొన్నారు. జర్నలిస్టులను వేధించడం, వారిపై దాడులు చేసే హక్కు ఏ ప్రభుత్వానికీ లేదని చెప్పారు. రాష్ట్ర ప్రజలు అంతా చూస్తున్నారని, ఇలా దాడులు జరగకుండా ప్రజా సంఘాలు ఖండించాల్సిన అవసరం ఉందన్నారు.

తీరు మారకుంటే మరిన్ని పోరాటాలు



ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ వలి మాట్లాడుతూ సాక్షిపై, సోషల్ మీడియాలో వచ్చే వ్యతిరేక వార్తలపై కూటమి ప్రభుత్వ పెద్దలు కమిటీలు వేస్తామని చెబుతున్నారని విమర్శించారు. ప్రశ్నించే వారిని వేధిస్తామని, పెన్నుతో ఏమీ సాధించలేరని వారు భావించడం శోచనీయమని పేర్కొన్నారు. ఇదే వైఖరిని ప్రభుత్వం కొనసాగిస్తే భవిష్యత్‌లో మరిన్ని పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. వెంటనే సాక్షి ఎడిటర్, పాత్రికేయులపై చేపట్టిన కక్షపూరిత చర్యలను వెనక్కి తీసుకోవాలని అన్నారు.



నరసరావుపేటలో కలెక్టరేట్‌కు ప్రదర్శనగా వస్తున్న జర్నలిస్టులు, ప్రజాసంఘాల నాయకులు

రూ.కోట్ల విలువైన భూమికి డబుల్ రిజిస్ట్రేషన్

- యజమాని ఫిర్యాదుతో వెలుగులోకి వచ్చిన అక్రమం
- నలుగురు నిందితులపై కేసు నమోదు చేసిన పోలీసులు

పెదకాకాని: రూ.కోట్ల విలువైన భూమికి సంబంధించి అక్రమ రిజిస్ట్రేషన్ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నిందితులపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. పెదకాకాని మండలం అగతవరప్పాడు గ్రామానికి చెందిన ఆట్ల వెంకటరెడ్డికి సర్వే నెంబరు '66-1బీ'లో 72 సెంట్ల భూమి ఉంది. కుటుంబ అవసరాల కోసం ఆ భూమిని విక్రయించాడు. కొంతకాలానికి ఆయన మరణించాడు. తరువాత ఆయన భార్య ఈశ్వరమ్మ, కుమారుడు బాలకృష్ణారెడ్డి, కుమార్తెలు తియ్యగూర హరికృష్ణ, భవనం గీతాకృష్ణలు చక్రం తిప్పారు. కొందరు రియల్ ఎస్టేట్ మీడియేటర్లతో కుమ్మక్కు అయ్యారు. గతంలోని విక్రయానికి సంబంధించిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్‌ను ఫోర్జరీ సంతకాలతో తాడేపల్లిగూడెం రిజిస్ట్రార్ కార్యాలయంలో రద్దు చేయించారు. ఆ భూమిని మీడియేటర్లు పచ్చా తిరుమలకృష్ణ, ప్రతాప్ సురేష్‌కుమార్, ఫక్రుద్దీన్ అహ్మద్‌లతో కలసి రూ. 60 లక్షలకు అమ్మారు. వాస్తవానికి గుంటూరు శ్యామలనగర్‌కు చెందిన మందాళ వివేకానందరెడ్డి తొలుత ఈ భూమిని కొనుగోలు చేశారు. తన భూమికి డబుల్ రిజిస్ట్రేషన్ జరిగిందని గుర్తించారు. దీనిపై 2024 జూన్ 22వ తేదీన జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లా రిజిస్ట్రార్ ఆదేశాల మేరకు ఆట్ల ఈశ్వరమ్మ, బాలకృష్ణారెడ్డి, హరికృష్ణ, గీతాకృష్ణలపై ఈ ఏడాది సెప్టెంబరు 11వ తేదీన పెదకాకాని రిజిస్ట్రార్ డి. భాస్కరరావు స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ షేక్ మీరాజ్ తెలిపారు. ప్రస్తుతం ఆ భూమి విలువ రూ.20 కోట్లకుపైగానే పలుకుతోంది.

ఎరువుల విక్రయాలు నిలుపుదల



తనిఖీ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

నగరంపాలెం: గుంటూరు పట్నంబజార్‌లోని బయో స్టిమ్యులేట్ ఎరువుల తయారీ షాపులు, ఇతర దుకాణాల్లో శుక్రవారం జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఆరు బృందాలుగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఏడు టోకు వర్తకుల దుకాణాల్లో రూ.1.01 కోట్ల విలువైన ఎరువుల విక్రయాలు నిలుపుదల చేశారు. మరో పదమూడు రీటైల్ వర్తకుల దుకాణాల్లో రూ.26.10 లక్షల విలువైన బయో స్టిమ్యులేట్ అమ్మకాలు, పార్శిల్ సర్వీసెస్‌లో రూ.5.15 లక్షల విలువైన సరుకుకు సంబంధించి పత్రాలు చూపకపోవడంతో వాటి విక్రయాలు నిలుపుదల చేశారు. తనిఖీల్లో సహాయ వ్యవసాయ సంచాలకులు ఎస్.మోహన్‌రావు (గుంటూరు), టి.శ్రీనివాసరావు (మంగళగిరి), వి.కోటేశ్వరి (పొన్నూరు), ఆర్.విజయబాబు (తెనాలి), సీహెచ్ తిరుమలదేవి (పీటీఎల్), ఐ.సునీత (బీసీఎల్) పాల్గొన్నారు. అనుమతుల్లేకుండా ఎరువులు విక్రయిస్తే ఉపేక్షించేది లేదని, చట్టపరమైన చర్యలు చేపడతామని జిల్లా వ్యవసాయ అధికారి అయితా నాగేశ్వరరావు తెలిపారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

తీర్పు వెలువరించిన ఒంగోలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి భారతి

సంతమాగులూరు(అద్దంకి): హత్య కేసులో ఓ వ్యక్తికి జీవిత ఖైదు, రూ.8 వేల జరిమానా విధిస్తూ శుక్రవారం ఒంగోలు ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి భారతి తీర్పునిచ్చారు. వివరాలు.. సంతమాగులూరులోని బీసీ కాలనీకి చెందిన రావూరి వెంకట నారాయణ, అంకమ్మ భార్యాభర్తలు. ఒక కుమారుడు ఉన్నాడు. మనస్పర్థలు రావడంతో అంకమ్మ భర్తను వదిలి వెళ్లిపోయింది. మరియమ్మకు మొదట వివాహం జరిగింది. అమ్మాయి, అబ్బాయి ఉన్నారు. ఆమె కూడా భర్తతో విడిపోయింది. ఈ క్రమంలో రావూరి వెంకట నారాయణతో పరిచయం కాగా.. ఇద్దరూ వివాహం చేసుకున్నారు. అయితే, కొంత కాలం నుంచి వెంకట నారాయణ తన రెండో భార్య మరియమ్మపై అనుమానం పెంచుకున్నాడు. దీనిపై తరచూ ఆమెతో గొడవ పడుతూ ఉండేవాడు. 2021లో కత్తితో ఆమెను హతమార్చాడు. శవాన్ని భుజాన వేసుకొని, గ్రామ సమీపంలోని పంట కాలువలో పడేసి వచ్చాడు. ఆ తర్వాత గ్రామంలో జరుగుతున్న నూతన సంవత్సర వేడుకల వద్దకు వచ్చాడు. వెంకట నారాయణ వాలకం గమనించిన అతని అల్లుడు రాచూరి ప్రసన్న మరికొంత మంది ప్రశ్నించగా, మరియమ్మను హత్య చేసినట్లు చెప్పాడు. ప్రసన్న ఫిర్యాదు మేరకు అప్పటి సంతమాగులూరు పోలీసులు వెంటనే నిందితుడిని అరెస్టు చేశారు. నేరం రుజువు కావడంతో వెంకటనారాయణకు జీవిత ఖైదుతో పాటు రూ. 5వేల జరిమానా, సాక్ష్యాధారాలు కనుమరుగు చేసిన నేరానికి రూ. 3వేలు విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు.

వెలుగుల పండుగలో ప్రమిదలు










దీపావళి పండుగ అంటే వెలుగుల సంబరాలు... ఆనందాల హరివిల్లు. ఈ పర్వదినాన ప్రతి ఇంటిలోనూ మట్టి ప్రమిదల వెలుగులు కాంతి విరజిమ్ముతాయి. ఆ దీపాలు అలంకారం మాత్రమే కాదు.. అంధకారంపై వెలుగుకు, అజ్ఞానంపై జ్ఞానానికి ఆధిపత్య సూచికలు. ప్రమిద వెలిగించడం ద్వారా చీకటిని పారద్రోలి మనలోని సత్సంకల్పాలను మేల్కొలుపుతామని మన సంస్కృతి చెబుతుంది. 'దీపం వెలిగితే దైవం వసిస్తుంది' అనేది నమ్మకం. ప్రతి దీపం ఒక శుభసూచకంగా, దైవ అనుగ్రహానికి సంకేతంగా వెలుగుతుంది. లక్ష్మీదేవిని ఆహ్వానిస్తూ వెలిగించే ఈ ప్రమిదలు సంపద, సంతోషం, శాంతి నింపే శక్తిగా భావిస్తారు. అందుకే నగరాల్లోనూ, గ్రామాల్లోనూ దీపావళి రాత్రి ప్రమిదల వెలుగుతో ప్రకాశించే దృశ్యం మన సంస్కృతికి ప్రతీకగా నిలుస్తోంది. తయారీదారులు వివిధ రూపాల్లో ప్రమిదలను విక్రయిస్తున్నారు. మార్కెట్లోకి వచ్చిన అలాంటి ప్రమిదలే ఇవి. - తెనాలి



వసతిగృహాల ముఖచిత్రం మారాలి

జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్

గుంటూరు వెస్ట్: పేద కుటుంబాలకు చెందిన పిల్లలు ఉండే ప్రభుత్వ భవనాల్లో నడుస్తున్న సంక్షేమ వసతి గృహాల ముఖ చిత్రాలు మారాలని జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా అన్నారు. ఇంజినీరింగ్, సంక్షేమ శాఖల అధికారులతో శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ.. వసతి గృహాల భవనాలు ఆహ్లాదకరంగా మారాలని సూచించారు. ప్రభుత్వ భవనాల్లో ఉన్న 20 సాంఘిక సంక్షేమ, 8 బీసీ సంక్షేమ, 3 గిరిజన సంక్షేమ వసతి గృహాలు సహా అంగన్వాడీ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. పరిశుభ్రమైన పరిసరాలు, రక్షిత తాగునీరు అందించాలన్నారు. రహదారుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని, నాణ్యతలో రాజీ పడరాదని స్పష్టం చేశారు.

తాగునీటి పథకాలకు నిధులు

ప్రజా ఆరోగ్య శాఖ పర్యవేక్షక ఇంజినీర్ డి.శ్రీనివాసులు మాట్లాడుతూ అమృత్ కింద ఏడు ప్రాజెక్ట్‌లకు రూ.331 కోట్లు మంజూరు అయ్యాయన్నారు. తక్కెళ్ళపాడు నుంచి బుడంపాడు వరకు పైపులైన్లు వేసి ఏటుకూరు గ్రామం వద్ద ఐదు లే అవుట్లకు నీరు ఇచ్చేందుకు పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. గోరంట్ల వద్ద రిజర్వాయర్ పూర్తి చేయడం ద్వారా చుట్టు పక్కల గ్రామాలకు కూడా నీరు అందించే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో హౌసింగ్ పి.డి. ప్రసాద్, ఆర్ అండ్ బీ ఎస్ఈ శ్రీనివాసమూర్తి, నగర పాలక సంస్థ పర్యవేక్షక ఇంజినీర్ సుందరరామి రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు. చెన్నయ్య, మహిళ, శిశు సంక్షేమ శాఖ అధికారి ప్రసూన పాల్గొన్నారు.

ఆహార సరఫరా సవ్యంగా సాగాలి

పాఠశాలలు, వసతి గృహాలు, అంగన్వాడీ కేంద్రాలకు సక్రమంగా ఆహారం పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ అన్నారు. పీఎం పోషణ్ - డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం కార్యక్రమంపై జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఆహార నాణ్యతలో లోపాలు ఉండరాదని చెప్పారు. నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డీఈవో రేణుక మాట్లాడుతూ జిల్లాలో ఈ పథకం కింద నెలకు రూ.3.32 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో జడ్పీ సీఈఓ వి.జ్యోతి బసు, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ పి ప్రసూన, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె విజయలక్ష్మి, డీఆర్‌డీఏ పి.డి. టి.విజయ లక్ష్మి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి యు.చెన్నయ్య, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ కె.తులసి, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి మయూరి, జిల్లా ఇంటర్మీడియట్ విద్య శాఖ అధికారి జె.పద్మ, ప్రాంతీయ పర్యవేక్షక అధికారి జి.సునీత తదితరులు పాల్గొన్నారు.

రక్తహీనతను రూపుమాపేలా చర్యలు

జిల్లాలో రక్తహీనతతో బాధపడుతున్న చిన్నారులు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యంపై అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ అన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రక్తహీనతను రూపుమాపాలని పేర్కొన్నారు. బాల్య వివాహాలు అరికట్టాల్సిన అవసరం ఉందని తెలిపారు. విద్యా సంస్థలలో బాలికలకు అవగాహన కల్పించాలని సూచించారు. అదనపు పోలీసు సూపరింటెండెంట్ రమణ మూర్తి, జడ్పీ సీఈఓ వి.జ్యోతి బసు, డీపీఓ బి.వి.నాగ సాయి కుమార్, దివ్యాంగుల శాఖ సహాయ సంచాలకులు డి.దుర్గా బాయి, డీఈవో రేణుక, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **1,500** గరిష్ఠం : రూ. **2,200**

మోడల్ ధర రూ. **1,800**

మిర్చి యార్డు సమాచారం

(శుక్రవారం ధరలు)



వచ్చిన బస్తాలు	37,368
అమ్మకాలు	42,710
నిల్వ	6,578

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000-15,000
నంబరు-5	10,000-14,500
273	10,500-13,800
341	10,000-15,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-15,000
నంబరు-5	10,000-14,800
341	10,000-15,800
4884	10,000-14,000
సూపర్-10	10,000-14,700

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 15,300
బాడిగ-355	10,500 - 15,600
దేవనూరు డీలక్స్	10,000 - 14,700
ఆర్మూర్	10,000 - 12,600
తాలుకాయలు	5,500 - 7,200

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-15,000
బాడిగ - 355	10,000-15,200
దేవనూరు డీలక్స్	10,500-14,800
తాలు	5,300 - 8,000

-కొరిటిపాడు (గుంటూరు)

క్లుప్తంగా

స్వదేశీ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్



గుంటూరు మెడికల్: స్వదేశీ ఉద్యమాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ ఏపీ అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్ అన్నారు. శుక్రవారం మంగళగిరి హాయ్‌లాండ్‌లో బీజేపీ అధికార ప్రతినిధులు, మీడియా ప్యానలిస్టులకు కార్యశాల జరిగింది. ముఖ్య అతిథిగా పీవీఎన్.మాధవ్, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యులు పాకా సత్యనారాయణ, 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకర్, తెలుగు, సంస్కృత అకాడమీ చైర్మన్ ఆర్‌డీ విల్సన్, రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి వల్లూరు జయప్రకాష్, రాష్ట్ర మీడియా ఇన్‌చార్జి కిలారు దిలీప్, బీజేపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్ తదితర నేతలు మాట్లాడారు. మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ ఎన్టీఆర్ వైద్య సేవ కింద కార్పొరేట్ ఆస్పత్రులలో పేదలకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక

టీడీపీ నాయకురాలి కుటుంబ సభ్యులు



వైఎస్సార్‌సీపీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానిస్తున్న ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

మంగళగిరి టౌన్: మంత్రి లోకేష్ ప్రాతినిధ్యం వహిస్తున్న మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని టీడీపీ శ్రేణులు షాక్‌కు గురయ్యాయి. టీటీడీ బోర్డు మెంబర్ తమ్మిశెట్టి జానకీదేవి కుటుంబంలోని కొందరు వైఎస్సార్‌సీపీలో చేరడమే దీనికి కారణం. తొలుత పాత మంగళగిరి సీతారామ కోవెల సెంటర్ నుంచి ఆత్మకూరు నియోజకవర్గ కార్యాలయం వరకు సుమారు వందమందికిపైగా యువతతో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మంగళగిరి వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్ ఆధ్వర్యంలో శుక్రవారం జానకీదేవి తోటికోడలు అయిన తమ్మిశెట్టి అనూరాధతోపాటు జితేంద్ర, గౌతమి, బిట్ర శ్వేతలు వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలోకి వారిని సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డిలు పార్టీ కండువాలు కప్పి, అభినందించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ... ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం విస్మరించడంతో పోరాటం చేస్తున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై నమ్మకంతో పార్టీలో చేరినట్లు పేర్కొన్నారు. పార్టీపై, అధినాయకుడిపై నమ్మకం ఉంచి పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికి సముచిత స్థానం ఉంటుందని మురుగుడు, డీవీఆర్‌లు సూచించారు. జానకీదేవి ప్రస్తుతం టీటీడీ బోర్డు మెంబరుగా ఉన్నారు. మొదటి నుంచి బీజేపీ నేపథ్యం ఉన్న ఆమె 2004లో మంగళగిరి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. 2009లో ప్రజారాజ్యం పార్టీలో చేరి మళ్లీ పోటీ చేసినా ఓడిపోయారు. 2024 ఎన్నికలకు ముందు టీడీపీలో చేరారు.

ఉచిత వైద్యం అందకుండా కూటమి కుట్ర



సుద్దపల్లిలో ఓ పొలం గట్టున రైతు కూలీలతో సంతకాలు చేయిస్తున్న అంబటి మురళీకృష్ణ

- వైఎస్సార్ సీపీ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ
- సుద్దపల్లిలో కోటి సంతకాల సేకరణ ప్రజా ఉద్యమం

చేబ్రోలు: పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేసి, ప్రజలకు ఉచిత వైద్యం అందకుండా చేయాలనే కుట్రతో ప్రభుత్వ మెడికల్ కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటుకు అప్పగిస్తోందని, దీనిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని వైఎస్సార్ సీపీ పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ అన్నారు. మెడికల్ కళాశాలలను ప్రైవేటుకు అప్పగించటాన్ని వ్యతిరేకిస్తూ మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు చేపట్టిన కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో భాగంగా శుక్రవారం సంతకాలు సేకరించారు. చేబ్రోలు మండలం సుద్దపల్లిలో పొలంలో పనిచేస్తున్న మహిళా రైతు కూలీలకు మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై అవగాహన కల్పించారు. రచ్చబండ సమావేశంలో అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ మాజీ సీఎం వైఎస్ జగన్ పేద విద్యార్థులకు వైద్య విద్య అందించటంతో పాటు బడుగులకు ఉచిత వైద్యం అందించేలా ప్రభుత్వ మెడికల్ కళాశాలలను నిర్మిస్తే.. కూటమి ప్రభుత్వం ప్రైవేటుకు అప్పగిస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఆళ్ల శ్రీరామిరెడ్డి, పార్టీ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు బి.భాస్కరరెడ్డి, అక్కిరెడ్డి, శంకరరావు, చందు సాంబశివరావు, పోతురాజు, గోపి, మమత, దాసరి దానమ్మ, చిరంజీవి, జానీ, వేణు, బాల చంద్రయ్య, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విలువలతో కూడిన నాయకత్వం అవసరం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ బి.సుధాకర్ రెడ్డి

చేబ్రోలు: విద్య కేవలం జ్ఞాన సంపాదనకే కాకుండా విలువలతో కూడిన నాయకత్వం పెంచుకోవడానికి కూడా ముఖ్యమని ఐసీఎస్ఎస్ఆర్-ఎస్ఆర్‌సీ హానరరీ డైరెక్టర్ ప్రొఫెసర్ బి.సుధాకర్ రెడ్డి అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడిలోని విజ్ఞాన్ యూనివర్సిటీలో ''కల్టివేటింగ్ ఎథికల్ బిజినెస్ లీడర్స్''పై రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ప్రొఫెసర్ బి.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ... నేటి యువత వ్యాపార రంగంలోకి అడుగుపెడుతున్నప్పుడు సామాజిక బాధ్యతతో కూడిన నైతిక విలువలే మార్గదర్శకాలు కావాలని సూచించారు. ఉస్మానియా వర్సిటీ మాజీ డీన్ ప్రొఫెసర్ ఎ. సూర్యనారాయణ మాట్లాడుతూ ఆధునిక సంస్థల్లో ఎదురయ్యే నైతిక సమస్యలను ఆచరణాత్మక కోణంలో విశ్లేషించారు. పుదుచ్చేరి యూనివర్సిటీ మేనేజ్‌మెంట్ స్కూల్‌కు చెందిన ప్రొఫెసర్ యార్లగడ్డ శ్రీనివాసులు ఐఐటీ హైదరాబాద్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ ఎం.పి.గణేష్‌లు కూడా ప్రసంగించారు. వంద మందికిపైగా ప్రతినిధులు తమ పరిశోధన పత్రాలను సమర్పించారు. వైస్ చాన్సలర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ పీఎంవీ రావు, డీన్లు తదితరులు పాల్గొన్నారు.

28న ధర్నాను జయప్రదం చేయండి

మంగళగిరి టౌన్: చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 28వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా ఏడీ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత కరెంటు అమలు చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పి నేటికీ అమలు చేయడంలో విఫలమయ్యారని అన్నారు. సహకార సంఘాలకు రావాల్సిన బకాయిలు రూ.203 కోట్లను ప్రభుత్వం విడుదల చేయకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. చేనేత రక్షణకు 11 రకాల రిజర్వేషన్లు అమలు జరపాలని కోరారు. చేనేతపై జీఎస్టీ పూర్తిగా రద్దు చేయాలన్నారు. చేనేత కార్మికులకు, సహకార సంఘాల్లో లేనివారికి ఇవ్వాల్సిన త్రిఫ్ట్ ఫండ్ రూ.27 కోట్లను కూడా విడుదల చేయాలని ప్రకటనలో పేర్కొన్నారు.

జాతీయ స్థాయి షూటింగ్ పోటీలకు ఎంపిక

గుంటూరు వెస్ట్ (క్రీడలు): సౌత్ జోన్ షూటింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో ద ఇండియన్ అకాడమీ ఆఫ్ షూటింగ్ స్పోర్ట్స్ షూటర్లు 20 మంది రైఫిల్, పిస్టల్ విభాగాలలో ప్రతిభ కనబరిచారని అకాడమీ చీఫ్ కోచ్ నాగిశెట్టి సుబ్రహ్మణ్యేశ్వర రావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 11వ తేదీ నుంచి జరిగే జాతీయ పోటీలకు ఎంపిక అయ్యారన్నారు. రైఫిల్ విభాగంలో వట్టిమల్లీ షణ్ముఖ రుష్యేంద్ర, శ్రీరంగ సాయి చరణ్, పారా ఆశ్రిత్ చౌదరి, వజ్జు దారియా, ఎం. కార్తికేయన్, దాసరి సౌమ్యశ్రీ, చిన్ను తేజస్, కాగిత విద్యావల్లి, కాగిత కుసుమవల్లి, కె.ఎస్.ఎస్ చక్రవర్తి, మట్లి యోక్షిత్ రెడ్డి, షేక్ హబీబా సుహానా, అన్నా బత్తిని రోహిత్ ఎంపికయ్యారని తెలిపారు. పిస్టల్ విభాగంలో కొనన పూర్ణిమ, సోడిశెట్టి ధరణీనాథ్, రాజ రాజేశ్వరి, ఒంటెద్దు నాగ లోహిత్ రెడ్డి, గ్రీష్మ సందేశి, అభిలాష్ చంద్ర, రిషిక్ బాబులు అర్హత సాధించారన్నారు. వీరిని రాష్ సెక్రెటరీ డి. రాజ్ కుమార్ తదితరులు అభినందించారన్నారు.

వైఎస్సార్‌సీపీలో పలువురు నాయకులకు పదవులు

నరసరావుపేట: వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పల్నాడు జిల్లాకు చెందిన పలువురు నాయకులను వివిధ హోదాల్లో నియమిస్తూ కేంద్ర పార్టీ కార్యాలయం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆర్గనైజేషనల్ సెక్రటరీలుగా నరసరావుపేటకు చెందిన గెల్లి బ్రహ్మారెడ్డి, యన్నం రాధాకృష్ణారెడ్డి, గురజాలకు చెందిన కలకంధ అంద్రయ్యను యాక్టివిటీ సెక్రటరీగా నియమితులయ్యారు. నరసరావుపేట అసెంబ్లీ నియోజకవర్గ ఎంప్లాయీస్ అండ్ పెన్షనర్స్ వింగ్ అధ్యక్షులుగా కంద్రకుంట మరియమ్మను నియమించారు.

బెల్టుషాపులను అరికట్టాలని కోరడం నేరమా?

కూటమి ప్రభుత్వ వైఖరిపై జెడ్పీటీసీ సభ్యుడు ఓబుల్‌రెడ్డి ఆగ్రహం



గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీటీసీ సభ్యురాలు తన మండలంలో విచ్చలవిడిగా కొనసాగుతున్న బెల్టుషాపులను అరికట్టాలని స్థానిక ఎమ్మెల్యే అయిన విద్యాశాఖ మంత్రి లోకేష్‌కు లేఖ రాయడం నేరమా అని రొంపిచర్ల వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యుడు పిల్లి ఓబుల్‌రెడ్డి ప్రశ్నించారు. దుగ్గిరాల వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యురాలు మేకతోటి అరుణ భర్తను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడంపై నిరసన వ్యక్తం చేసిన పిల్లి ఓబుల్‌రెడ్డి... ఈ ఘటనను వైఎస్సార్ సీపీ జెడ్పీటీసీ సభ్యులందరూ ముక్త కంఠంతో ఖండిస్తున్నట్లు శుక్రవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఉన్న కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా బెల్టుషాపులకు, నకిలీ మద్యానికి తావు లేకుండా పాలన సాగిందని పేర్కొన్నారు. అరెస్టు విషయంలో న్యాయం జరిగే వరకు బాధితులకు తాము అందరం అండగా ఉంటామని ఆయన తెలిపారు.

ఏపీ ఎన్జీవో అసోసియేషన్ అమరావతి అధ్యక్షుడిగా బెజ్జం అశోక్



ఎన్నికైన సభ్యులను అభినందిస్తున్న ఉద్యోగులు

తాడికొండ: ఏపీ ఎన్‌జీవో అసోసియేషన్ అమరావతి యూనిట్ అధ్యక్షుడిగా బెజ్జం అశోక్ ఎన్నికయ్యారు. ఈ మేరకు సంఘం నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం తాడికొండ రూరల్ హెల్త్ సెంటర్‌లో తాడికొండ, తుళ్లూరు, మేడికొండూరు, ఫిరంగిపురం మండలాలకు కలిపి యూనిట్ ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. ఎన్నికల అధికారిగా బి.కృష్ణ కిషోర్, సహాయ ఎన్నికల అధికారిగా కె. శేషగిరి రాజు వ్యవహరించారు. 16 మందితో కూడిన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎన్నికల పరిశీలకుడిగా కె. విజయ్ బాబు వ్యవహరించారు. అమరావతి యూనిట్ అధ్యక్షుడిగా బెజ్జం అశోక్ కుమార్, సహ అధ్యక్షుడిగా కె. రవిబాబు, ఉపాధ్యక్షులుగా షేక్ సుభాని, ఎ. లలిత కుమారి, ఇ. చంద్రబాబు, పి. మల్లికార్జున రావు, మహిళా ఉపాధ్యక్షులుగా సీహెచ్ శారదాదేవి, కార్యదర్శిగా షేక్ అబ్దుల్ కరీం, కార్యనిర్వాహక కార్యదర్శిగా డాక్టర్ డి.శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శులుగా వి. రామాంజనేయులు, డి.అరుణకుమార్, బి.రాంబాబు, పి.అంకమ్మరావు, మహిళా సంయుక్త కార్యదర్శిగా ఎం.నాగమణి, కోశాధికారిగా ఎ.పూర్ణయ్య, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా ఎస్. ఏసునాథరావులు ఎన్నికయ్యారు. వీరు మూడేళ్ల పదవిలో కొనసాగుతారని ఎన్నికల అధికారి ప్రకటించారు. అభినందన సభకు ముఖ్య అతిథులుగా ఏపీఎన్జీవో ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి శ్యాంసుందర్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్ హాజరయ్యారు. సభ్యులను పూలమాలలతో సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు డి.డి. నాయక్, ఎస్.వెంకటరెడ్డి సత్తెనపల్లి యూనిట్ అధ్యక్షుడు మణిరావు, అమరావతి యూనిట్ మాజీ అధ్యక్షుడు రావు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఏసీఏ అపెక్స్ కమిటీ సభ్యుడిగా ఆస్కార్ వినోద్



గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అపెక్స్ కమిటీ సభ్యునిగా గుంటూరుకు చెందిన మాజీ రంజీ ఆటగాడు డి.ఆస్కార్ వినోద్ కుమార్ (ప్లేయర్స్ రిప్రజెంటేషన్) ఎంపికయ్యారని గుంటూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ త్రీమెన్ కమిటీ సభ్యులు యు.మహతీశంకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇండియన్ క్రికెట్ అసోసియేషన్ నిర్వహించిన ఎన్నికల్లో వినోద్‌తోపాటు బీసీసీఐ నిర్వహించిన ఎన్నికల్లో ఏసీఏ అపెక్స్ కమిటీ సభ్యునిగా మాజీ రంజీ క్రికెటర్ చాముండేశ్వరీనాథ్ ఎన్నికయ్యారన్నారు. లెఫ్ట్ హ్యాండర్ అయిన వినోద్ కుమార్ గుంటూరులోనే తన క్రికెట్ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1989-96 మధ్య ఆంధ్ర జట్టు తరపున 21 రంజీ మ్యాచ్‌లతోపాటు పలు టోర్నమెంట్‌లలో ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా మహతీశంకర్, వి.అర్జున్, బి.సుధాకర్‌లు అభినందనలు తెలిపారు.

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

ఆధిపత్య పోరు, పాత కక్షలే కారణమని డీఎస్పీ వెల్లడి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జనార్దనరావు

తెనాలి రూరల్: తెనాలిలో పట్టపగలు నడిరోడ్డుపై ఓ వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటనలో నిందితుడిని పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు. స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో డీఎస్పీ బి.జనార్దనరావు కేసు వివరాలను వెల్లడించారు. ఆయన చెప్పిన వివరాల మేరకు... బాపట్ల జిల్లా అమృతలూరు మండలం కోరుతాడిపర్రు గ్రామానికి చెందిన జుటూరి తిరుపతిరావు(60) ఈ నెల 14న పట్టణంలో హత్యకు గురైన సంగతి తెలిసిందే. తిరుపతిరావు గ్రామంలోని రామాలయం పాలకవర్గంలో కీలకంగా ఉన్నాడు. ఆలయ చెరువుల వేలం పాటల నిర్వహణ బాధ్యత చూసేవాడు. 15 రోజుల క్రితం జ్వరం రావడంతో తిరుపతిరావు తన భార్యతో కలసి తెనాలిలో నివాసం ఉంటున్న కుమార్తె గండికోట దుర్గ ఇంటికి వచ్చాడు. ఈ నెల 14న టిఫిన్ కోసం బైక్‌పై ఇంటి నుంచి బయటకు వచ్చాడు. సమీపంలో టిఫిన్ సెంటర్ వద్ద బైక్‌పై కూర్చున్నాడు. అదే సమయంలో కోరుతాడిపర్రు గ్రామానికి చెందిన గండికోట వెంకటసుబ్బారావు వచ్చి కొబ్బరి బొండాల కత్తితో విచక్షణ రహితంగా దాడి చేసి పారిపోయాడు. తిరుపతిరావుతో నిందితుడికి కొంతకాలంగా విభేదాలున్నాయి. నిందితుడి వ్యక్తిగత విషయాలలోనూ తిరుపతిరావు జోక్యం చేసుకున్న కారణంగా కక్ష పెంచుకొని ఈ దారుణానికి ఒడిగట్టాడు. ఆలయ వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరించడం, గతంలో తన తండ్రి మృతికి కూడా తిరుపతిరావు కారణమయ్యాడని భావించి రెక్కీ నిర్వహించి మరీ హత్యకు పాల్పడ్డాడు. నిందితుడిపై పట్టణ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో గతంలో మూడు కేసులు, అమృతలూరు పోలీస్‌స్టేషన్‌లో రెండు కేసులు నమోదైనట్లు వెల్లడించారు. తిరుపతిరావు భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కంచర్లపాలెం రోడ్డులో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు డీఎస్పీ చెప్పారు. సమావేశంలో సీఐ ఎస్. సాంబశివరావు, త్రీ టౌన్ ఎస్ఐ కరిముల్లా, రూరల్ ఎస్ఐ కె. ఆనంద్, సిబ్బంది ఉన్నారు.

కబడ్డీ టోర్నీలో క్రీడాకారిణుల ప్రతిభ



క్రీడాకారిణులతో కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: నగర శివారు లాంలోని చలపతి ఫార్మసీ కళాశాలలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళల కబడ్డీ టోర్నమెంట్ రెండో రోజు శుక్రవారం పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. వివిధ కళాశాలల జట్లు ప్రతిభ చాటాయి. నరసరావుపేట కృష్ణవేణి డిగ్రీ కళాశాల, తెనాలి జె.ఎం.జె. డిగ్రీ కళాశాల, గుంటూరు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ అండ్ సైన్స్ విభాగం, గుంటూరు ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలు వరుసగా తొలి నాలుగు స్థానాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ నాదెండ్ల రామారావు తెలిపారు. అనంతరం బహుమతి ప్రదాన కార్యక్రమంలో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం యోగా కోఆర్డినేటర్ డాక్టర్ డి. సూర్యనారాయణ పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్, చలపతి విద్యాసంస్థల చైర్మన్ వైవీ ఆంజనేయులు తదితరులు విజేతలను అభినందించారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న దాసరి వెంకటేశ్వరరావు

లక్ష్మీపురం: విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు, జేఎల్ఎం గ్రేడ్ -2ల సమస్యలను పరిష్కరించాలని ఏపీ విద్యుత్ స్ట్రగుల్ కమిటీ జిల్లా చైర్మన్ దాసరి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గుంటూరు పొన్నూరు రోడ్డులోని విద్యుత్ భవన్ కార్యాలయం ఎదుట శుక్రవారం కమిటీ ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. వి. రాంప్రభాకర్, జి. నాగరాజులు నేతృత్వం వహించారు. దాసరి వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణరావు, జిల్లా నాయకులు సుబ్బారెడ్డిలు మాట్లాడుతూ... సమస్యలు పరిష్కారం అయ్యే వరకు పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. మెడికల్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు అబ్దుల్ సలీం, ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.చిష్టీ, 104 ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు జి.సురేష్ కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీహర్ష, విద్యుత్ సీఐటీయూ నాయకులు పవన్, రాంబాబు, శివనాగేశ్వరరావు, సురేష్, నాగరాజు, సలీంబాషా, వర్మ, వంశీ, బి. రవికుమార్, వీరారెడ్డి, లెనిన్ బాబు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మెలోడియోసిస్ రోగికి విజయవంతంగా చికిత్స



వివరాలు వెల్లడిస్తున్న డాక్టర్ యశస్వి రమణ, పక్కన చికిత్స పొందిన ఎలీషా

గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా సుమారు నాలుగు నెలలకుపైగా అందరిని ఆందోళనకు గురిచేస్తున్న మెలోడియోసిస్ వ్యాధి బాధితునికి గుంటూరు జీజీహెచ్ వైద్యులు రెండు నెలల పాటు వైద్యసేవలు అందించి ప్రాణాలు కాపాడారు. శుక్రవారం గుంటూరు జీజీహెచ్‌లో విలేకరుల సమావేశంలో సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ మీడియాకు ఈ వివరాలు వెల్లడించారు. గుంటూరు రూరల్ మండలం తురకపాలేనికి చెందిన పి.ఎలీషా (42) ఆగస్టు 21న అడ్మిట్ అయ్యారన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామని తెలిపారు. మెలోడియోసిస్ ఉందని నిర్ధారించామని, రెండు నెలలపాటు వైద్యం అందించి వ్యాధి నుంచి విముక్తుడిని చేశామన్నారు. జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ పి.ఉషారాణి మాట్లాడుతూ ఈ విషయంలో ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ అనిల్ కుమార్ బృందం, జనరల్ సర్జరీ విభాగం సహకారం అందించారని పేర్కొన్నారు. ప్రొఫెసర్ డాక్టర్ సి.వాసవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జి.ప్రభాకర్, పీజీ వైద్యులు డాక్టర్ కే ఆశాజ్యోతి, డాక్టర్ వి.స్వర్ణ సేవలు అందించినట్లు చెప్పారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న ఆటో

- హస్తకళల డిజైనర్ మృతి
- హాస్టల్ వార్డెన్‌కు తీవ్ర గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన ఎస్.సుగుణరాజు

మాచర్ల రూరల్: ఆగి ఉన్న లారీని ఆటో ఢీకొన్న ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న హస్తకళల డిజైనర్ అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మాచర్ల మండలం తాళ్లపల్లి కుడి కాలువ సమీపంలోని మాచర్ల-సాగర్ ప్రధాన రహదారిపై శుక్రవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. కొత్తూరులోని హస్తకళల వారికి శిక్షణ ఇచ్చేందుకు వచ్చిన ట్రైనర్‌లు ఎస్.సుగుణరాజు, ఫిలిప్, వంగడ రమేష్ కొత్తూరు నుంచి పోచం నర్సింహారావు అనే వృద్ధుడు ఆటోలో మాచర్ల బయలుదేరారు. ఏడో మైలులోని గిరిజన ఆశ్రమ పాఠశాల వార్డెన్ నాగ మల్లీశ్వరి, మరో వ్యక్తి కూడా ఆటో ఎక్కారు. తాళ్లపల్లి సమీపంలోకి రాగానే రోడ్డుపై నిలిచి ఉన్న లారీని ఆటో ఢీకొట్టింది. ఆటోలో ప్రయాణిస్తున్న హస్తకళల ట్రైనర్ ఎస్.సుగుణరాజు (35) అక్కడికక్కడే మృతి చెందాడు. వార్డెన్ నాగ మల్లీశ్వరికి, ట్రైనర్ ఫిలిప్‌కు తీవ్ర గాయాలుకాగా వంగడ రమేష్‌కు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను మాచర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు సుగుణరాజుకు వివాహం కాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజయపురిసౌత్ ఎస్ఐ అశోక్ తెలిపారు.

విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలి



బహుమతులు సాధించిన విద్యార్థులతో డీఈవో చంద్రకళ

నరసరావుపేటరూరల్: విద్యార్థులు సృజనాత్మకతను పెంపొందించుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ తెలిపారు. జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ పోటీలు శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పోటీలను జిల్లా విద్యాశాఖ అధికారి ప్రారంభించారు. కాకాని జెడ్పీ హైస్కూల్‌కు చెందిన వక్కలగడ్డ కాత్యాయనీ ప్రథమ స్థానం, నరసరావుపేట మున్సిపల్ హైస్కూల్‌కు చెందిన కోడిరెక్క ఇమ్మానియేల్‌కు ద్వితీయ స్థానం లభించింది. ఈ రెండు నమూనాలను శనివారం విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికచేశారు. రాష్ట్ర స్థాయి సైన్స్ సెమినార్‌లో జిల్లా విద్యార్థులు మెరుగైన ప్రదర్శన ఇవ్వాలని డీఈవో తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో ఎస్‌కె సుభాని, సత్తెనపల్లి డీఈవో ఏసుబాబు, జిల్లా సైన్స్ అధికారి ఎస్.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.